వైద్య శిబిరానికి విశేష స్పందన

హయత్‌నగర్: జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం లింగోజిగూడ ఓల్డ్ విలేజ్‌లో అభిమానులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానికులు పెద్ద ఎత్తున శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... వార్డులోని ప్రజలకు ఎలాంటి అవసరం ఉన్నా.. తనను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి, రోహిత్, కరున్, నరేందర్, రఘుయాదవ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అజిత్‌రెడ్డికి మలక్‌పేట బీఆర్‌ఎస్ పగ్గాలు?



అజిత్‌రెడ్డి (ఫైల్)

చాదర్‌ఘాట్: బీఆర్‌ఎస్ రాష్ట్ర పార్టీ ఆదేశాల ప్రకారం మలక్‌పేట నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జిగా తీగల అజిత్‌రెడ్డి నియామకం కానున్నారు. పార్టీ అనుచరుల విశ్వసనీయ సమాచారం ప్రకారం .. రెండు రోజుల క్రితం అజంపురాలో ప్రస్తుత ఇన్‌చార్జి అజమ్‌అలీ, మలక్‌పేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి మధ్య మాజీ హోంమంత్రి మహమూద్ అలీ సమక్షంలో చర్చలు జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా నియోజకవర్గం పార్టీ బాధ్యతలు తీసుకోవాల్సిందిగా అజిత్‌రెడ్డికి చెప్పినట్లు సమాచారం.ఈ విషయమై అజిత్‌రెడ్డిని సంప్రదించగా త్వరలో పార్టీ బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆకుల రమేష్‌గౌడ్‌కు ఘన నివాళి



రమేష్‌గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆకుల రమేష్‌గౌడ్ 3వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఆదివారం ఘన నివాళులర్పించారు. చంపాపేట డివిజన్‌లోని పలు చౌరస్తాల్లో స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి బీజేపీ నాయకులతో కలిసి రమేష్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రమేష్‌గౌడ్ మున్సిపల్ చైర్మన్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలోనే ఎల్‌బీనగర్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఆ తర్వాత లింగోజిగూడ కార్పొరేటర్‌గా విజయం సాధించిన ఆయన ప్రమాణస్వీకారం చేయకముందే కరోనా సోకడంతో మృతి చెందారని గుర్తు చేశారు. అనంతరం స్థానికులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేష్‌గౌడ్ కుమారుడు అఖిల్‌గౌడ్, నాయకులు పండాల శేఖర్‌గౌడ్, పాలెం శేఖర్, సందీప్, రాజేష్, శ్రీనివాస్, మల్లేష్, కొత్త రవీందర్‌గౌడ్, అంజన్ కుమార్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పద్మశాలి ఉద్యోగుల కేలండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు, యాదగిరి తదితరులు

మన్సూరాబాద్: తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం ఎల్‌బీనగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాసు యాదగిరి, సంస్థాగత కార్యదర్శి శిరందాసు యాదగిరేందర్, సహాయ కార్యదర్శులు చింతకింది సుజాత, సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల అండతోనే అక్రమ నిర్మాణాలు: కొప్పుల

మన్సూరాబాద్: జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల అండతో డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు భారీగా వెలుస్తున్నాయని, దీంతో జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండిపడుతోందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ధ్వజమెత్తారు. డివిజన్‌లోని హయత్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కాలనీవాసుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఆదివారం కార్పొరేటర్ ఆయా నిర్మాణాలను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ, నూతనంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ నిర్మాణదారులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) రాగానే ప్రహరీ హద్దులు మార్చి రోడ్డును ఆక్రమిస్తున్నారని మండిపడ్డారు, జీప్లస్‌వన్ అనుమతి తీసుకుని బహుళ అంతస్తుల నిర్మిస్తున్నారన్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై ఆయా కాలనీలవాసులు ఫిర్యాదులు చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రియదర్శిని కాలనీలో రోడ్డును కబ్జా చేసి ప్రహరీ నిర్మిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టడం లేదని అన్నారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మధుసూదన్‌రెడ్డి, లింగస్వామి, శ్రీనివాసులు, సత్యనారాయణరెడ్డి, సురేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం



పాల్గొన్న జడ్జి సురేందర్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, పవన్‌కుమార్

నాగోలు: క్రీడలు ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని హైకోర్టు జడ్జి జస్టిస్ సురేందర్ అన్నారు. కొత్తపేట డివిజన్ న్యూనాగోలు కాలనీలో ఆర్‌–3 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆదివారం జడ్జి సురేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రోజూ క్రీడలు ఆడటం వల్ల ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. యువత సమయం వృథా చేయకుండా క్రీడాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, చైతన్యపురి సీఐ నాగార్జున, వెంకటేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అదిరిన ముగింపు వేడుకలు



దిల్‌సుఖ్‌నగర్: డిసెంబర్ 31 ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాత సంవత్సర చేదు, తీపి జ్ఞాపకాలను నేమరువేసుకుంటూ నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు మలక్‌పేట జోన్ పరిధిలోని పలు ప్రాంతాలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. ప్రత్యేక వేడుకలు, విందు, వినోదాలతో యువతరం హోరెత్తింది. ముగింపు వేడుకల కోసం దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, ఆర్‌కేపురం, అల్కాపురి, ఎల్‌బీనగర్, సైదాబాద్, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాలలో ప్రత్యేక డిస్కౌంట్ ఆఫర్లతో మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో, సంగీతపు హోరుతో, నోరూరించే విందు భోజనాలకు హోటళ్లు, రెస్టారెంట్లు వేదికగా మారాయి. నూతన సంవత్సర సంబురాలకోసం జోన్ పరిధిలోని ప్రధాన రోడ్లు, చౌరస్తాలలో ఉన్న స్వీట్ షాపులు, బేకరీలు ప్రత్యేక ఆఫర్లతో అందరినీ ఆకర్షించాయి.

సైదాబాద్ ఠాణా పరిధిలో...

తగ్గిన నేరాలు- పెరిగిన రికవరీ



సైదాబాద్ పోలీస్‌స్టేషన్

సైదాబాద్: గతేడాదితో పోలిస్తే సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల సంఖ్య చాలా తగ్గింది. అలాగే వివిధ కేసుల్లో బాధితులు కోల్పోయిన సొమ్ము రికవరీ శాతం కూడా పెరిగింది. కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా శాంతి, భద్రతలపై అవగాహన కల్పించేందుకు ప్రతీ వారం పోలీసు స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు సఫలమయ్యాయి. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ వారి నుంచి ఫిర్యాదులను స్వీకరించిన వెంటనే వాటిపై విచారణ చేసి ప్రజల మన్ననలు పొందటానికి సైదాబాద్ పోలీసులు చేసిన కృషి ఫలించింది. అందువల్లే ఠాణా పరిధిలో గతేడాది కేసుల నమోదు భారీగా తగ్గిందని, దొంగతనాల కేసుల్లో విచారణ ముమ్మరం చేయడం ద్వారా బాధితుల సొమ్ము రికవరీ శాతం పెరిగిందని ఠాణా అధికారులు చెప్తున్నారు. 2022 సంవత్సరంతో పోల్చి చూస్తే 2023లో నమోదైన కేసుల వివరాలు ఇలా ఉన్నాయి.

- 2022లో సైదాబాద్ పరిధిలో మొత్తం 608 కేసులు నమోదు కాగా, 2023లో ఆ సంఖ్య 470కు తగ్గింది.
- గతేడాది ప్రాపర్టీ కేసులు 65 నమోదు కాగా, ఈ యేడాది ఆ సంఖ్య 54కు తగ్గింది.
- 2022లో బాధితుల నుంచి పోయిన సొత్తులో 53 శాతం రికవరీ కాగా, ఈ యేడాది రికవరీ శాతం 80 శాతానికి పెరిగింది.
- గతేడాది బాధితులు పోగొట్టుకున్న ఆస్తి రూ.30,04,250. పోలీసులు రికవరీ చేసిన ఆస్తి రూ.15,91,650. అదే విధంగా 2023లో బాధితులు పోగొట్టుకున్న ఆస్తి రూ.43,55,700 కాగా, పోలీసులు రికవరీ చేసింది రూ. 34,75,270
- 2022లో సైదాబాద్‌లో తీవ్రమైన నేరాలు 20 నమోదు కాగా, ఈ యేడాది ఆ సంఖ్య 12 మాత్రమే.
- 2022లో 6495 పెట్టీ కేసులు నమోదు కాగా, వాటిలో 5783 కేసులు పరిష్కారమయ్యాయి. 697 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.
- 2023లో నమోదైన పెట్టీ కేసులు 2467. వాటిలో 2270 పరిష్కారం కాగా, 257 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.

అప్రమత్తంగా ఉండాలి



సైబర్ క్రైమ్‌ల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. ఫోన్లలో అపరిచితులకు ఆర్థిక లావాదేవీల వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియజేయరాదు. సైబర్‌క్రైమ్‌ల గురించి అవగాహన పెంచుకోవాలి. అందరూ తమ ఇళ్ల వద్ద, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా నిందితులను తొందరగా పట్టుకోవటానికి అవకాశాలు పెరుగుతాయి. కాలనీలు, బస్తీల్లో అపరిచితులు అనుమానాస్పదంగా తిరుగుతుంటే పోలీసులకు సమాచారమివ్వాలి.

–రాఘవేందర్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ఎన్‌ఎస్‌యూఐ నాయకులతో కలిసి పోస్టర్ విడుదల చేస్తున్న షేక్ అక్బర్, సోహేల్

మలక్‌పేట: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ మలక్‌పేట ఇన్‌చార్జి షేక్ అక్బర్ అన్నారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సోహేల్ ఆధ్వర్యంలో ఆదివారం మలక్‌పేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై యాంటీ డ్రగ్స్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అక్బర్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలు వాడకం వ్యక్తులను, కుటుంబాలను, సమాజాన్ని నాశనం చేస్తాయన్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గట్టి సంకల్పంతో ముందుకెళ్తున్నారని తెలిపారు. ఆరోగ్యకరమైన సమాజ స్థాపనే ధ్యేయంగా సీఎం ఆశయాలకు తగినట్లు ఎన్‌ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి డ్రగ్స్ వలన కలిగే అనర్థాలపై విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ముజామిల్, వరుణ్, అమీర్, మాలిక్, ముజీబ్, సఫై, జోహెబ్ పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు నిలిపివేయకుంటే ఆందోళన



కాలనీలో అండర్ కేబుల్ లైన్ కోసం తవ్వకాలు జరిపిన దృశ్యం

చంపాపేట: చంపాపేట డివిజన్ కటకోని కుంట కాలనీలో బచపన్ ఉన్నత పాఠశాల సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రారంభించిన 33 కేవీ అండర్ కేబుల్ పనులను నిలిపివేయకుంటే కాలనీవాసులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధి, నగర అంబేడ్కర్ యువజన అధ్యక్షుడు కట్టా వెంకటేష్ హెచ్చరించారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో కాలనీవాసులు అండర్ కేబుల్ పనులను అడ్డుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బచపన్ పాఠశాల స్థల యజమాని సర్కిల్, ట్రాన్స్‌కో అధికారులను ప్రలోభపెట్టి తన స్థలంలో అడ్డంగా గతంలో ఏర్పాటు చేసిన 33 కేవీ విద్యుత్ లైన్‌ను ఇరుకైన రహదారి వెంట ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటికే ఆ రహదారిలో వాటర్ పైప్‌లైన్, భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేశారని, భవిష్యత్‌లో వాటి మరమ్మతు కోసం తవ్వకాలు జరిపితే విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే సర్కిల్ జెడ్‌సీ, డీసీ, విద్యుత్ లైన్ డీఈ, సరూర్‌నగర్ ఎమ్మార్వో, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో మంత్రి జగన్, తోకటి కిరణ్, ఎడ శంకర్, గ్యార జగన్, లక్ష్మణ్, కేకే యాదగిరి, లక్ష్మణ్, జిట్టా నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

ఎల్‌బీనగర్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని బీఎన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో రహదారుల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తను కాలనీవాసులతో కలిసి తొలగించారు. కార్యక్రమంలో నాయకులు శంకరయ్యగౌడ్, మెట్టుపల్లి సంతోష్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు శ్రీశైలం, బాలునాయక్, రవి, సాంబయ్య, సోమయ్యగౌడ్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ

మలక్‌పేట: మూసారంబాగ్ కేటీనగర్ బేతనీయ బాప్టిస్టు చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమానికి మలక్‌పేట అహ్మద్ బలాల, డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు క్రైస్తవులకు ప్రభుత్వ క్రిస్మస్ కానులకు అందజేశారు. చర్చి పాస్టర్ రెవరెండ్ శామ్యూల్ బాబు బైరపోగు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి క్రిస్మస్, నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. పాస్టర్ షీలాడోరతి బైరపోగు, మోజేష్, అభిషేకం, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల అందజేత



కార్యక్రమంలో పాల్గొన్న సామ రంగారెడ్డి తదితరులు

హయత్‌నగర్: అయోధ్య రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ తదితర హిందూ ధార్మిక సంస్థలు చేపట్టిన అయోధ్య అంక్షింతల పంపిణీ ఆదివారం హయత్‌నగర్‌లోని అయ్యప్ప ఆలయంలో నిర్వహించారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై భక్తులకు అంక్షింతలు పంపిణీ చేశారు. అక్షింతలు తీసుకున్న వారు భక్తిశ్రద్ధలతో వాటిని పూజించాలని వారు సూచించారు.

ఘనంగా శోభాయాత్ర..



చంచల్‌గూడ: అయోధ్యలో శ్రీరామ మందిరం నిర్మాణంలో భాగంగా పూజించిన అక్షింతల శోభాయాత్ర శనివారం రాత్రి కుర్మగూడ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయం నుంచి స్వామివారి అక్షింతలను, విగ్రహమూర్తులను బజాభజంత్రీల మధ్య భక్తి గీతాలు పాడుతూ కుర్మగూడ, భరత్‌నగర్, మాదన్నపేట, ఉప్పరిగూడ బస్తీల్లో ఊరేగించారు. నాటి అయోధ్య ఉద్యమంలో జైలు జీవితం గడిపిన బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ మొట్టమొదటగా స్వామివారి అక్షింతల కలశాన్ని ఎత్తుకుని శోభాయాత్రను ప్రారంభించారు.ఆలయ కమిటీ సభ్యులు బర్ల శ్రవణ్ కుమార్, గోపినాథ్, అనిల్‌కుమార్, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, దేవరాజు, హరినాథ్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని సమస్యలన్నీ పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో నెలకున్న మౌలిక సమస్యలన్నింటినీ దశల వారీగా పరిష్కరించి ఇతర నియోజకవర్గాలకు ఆదర్శవంతంగా తీర్చిదిద్దటమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గడ్డిఅన్నారంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎల్‌బీనగర్ అభివృద్ధికి ప్రజలందరూ సహకారం అందిస్తూ ప్రత్యక్షంగా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. పెండింగ్ పనులన్నింటినీ సాధ్యమైనంత త్వరలో పూర్తి చేస్తామన్నారు.

మూడు రోజుల్లో 1,34,213 దరఖాస్తులు

- ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో 'ప్రజాపాలన' కు విశేష స్పందన
- అత్యధికంగా కాప్రా సర్కిల్‌లో 37,358 దరఖాస్తులు



అభయ హస్తం దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు (ఫైల్)

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో ప్రజాపాలన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. గత మూడు రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పథకాల (అభయ హస్తం) కోసం దరఖాస్తు చేసేందుకు ప్రజలు పోటెత్తారు. ఎల్బీనగర్ జోనల్ పరిధిలో శనివారం సుమారు 52,999 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం, సోమవారం సెలవు కావడంతో తిరిగి ఈ పథకానికి మంగళవారం నుంచి ఆయా కేంద్రాల వద్ద దరఖాస్తులు స్వీకరిస్తారని అధికారులు చెప్పారు. ప్రజాపాలన కార్యక్రమం మొదటి రోజు 31,332 మంది, రెండో రోజు 49,882, మూడో రోజు 52,999 మంది దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు. అత్యధికంగా, కాప్రా సర్కిల్‌లో 37,358 మంది దరఖాస్తులు చేసుకోగా, అత్యల్పంగా ఎల్‌బీనగర్ సర్కిల్–4లో 19,754 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ అభయ హస్తం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో 92 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎక్కడా జనం రద్దీ ఏర్పడకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. దరఖాస్తుల కోసం వచ్చే వారి కోసం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం వద్ద పోలీసు బందోబస్తును సైతం ఉంచారు.

సర్కిళ్ల వారీగా వచ్చిన దరఖాస్తులు

- కాప్రా సర్కిల్ పరిధిలో 37,358
- ఉప్పల్ సర్కిల్ పరిధిలో 26,266
- ఎల్‌బీనగర సర్కిల్–3లో 27,320
- ఎల్‌బీనగర్ సర్కిల్–4లో 19.754
- ఎల్‌బీనగర్ సర్కిల్–5లో 23.515